క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో వివిధ కారణాల రీత్యా ఖాళీగా ఉన్న 81 వార్డు వలంటీర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కార్పొరేషన్ కమిషనర్ రెడ్డి శ్రీరాములనాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వలంటీర్ పోస్టుల భర్తీకి చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 26లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు కార్పొరేషన్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

పౌష్టికాహార ప్రాముఖ్యత తెలుసుకోవాలి



గర్భిణులకు సామూహిక సీమంతం

విజయనగరం: గర్భిణులు పౌష్టికాహార ప్రాముఖ్యత తెలుసుకోవాలని రోటరీ మెయిన్ క్లబ్ అధ్యక్షురాలు డాక్టర్ కె.కృష్ణశాంతి సూచించారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో గుంకలాం రామాలయంలో 15 మంది గర్భిణులకు గురువారం సామూహిక సీమంతం నిర్వహించి.. చీర, పసుపు, కుంకుమ, స్వీట్లు, పండ్లు, పువ్వులు, గాజులు అందజేశారు. అనంతరం తిరుమల మెడికోవర్ హాస్పిటల్ సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కృష్ణశాంతి మాట్లాడుతూ, పౌష్టికాహారం లోపిస్తే ప్రసవ సమయంలో ఇబ్బందులేర్పడతాయని చెప్పారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ కార్యదర్శి నీతా వీజ్వానీ, ప్రతినిధులు మేఘరాజ్ రాథి, చంద్రశేఖర్, చెన్నయ్య శెట్టి, వీరభద్రరావు, ఉమా బాలాజీ, సూర్యలక్ష్మి, రాధిక, మంజుల, మాతృశ్రీ, రూప, హేమ, శ్రీరామమూర్తి, ఇన్నర్ వీల్ క్లబ్ కార్యదర్శి సంధ్య, రమ, గ్రామ సర్పంచ్, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులు ఆపాలి

విజయనగరం పూల్‌బాగ్: రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల సమస్యలపై ప్రశ్నిస్తున్న విద్యార్థులు, విద్యార్థి సంఘ నాయకులను అక్రమంగా అరెస్టు చేస్తున్నారని, వెంటనే అరెస్టులను ఆపాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎం. సౌమ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద నిరసన చేపట్టారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు జె.రవికుమార్, కె. రాజు, పి. రమేష్, లావణ్య, షణ్ముఖ, వెంకటరమణ, ఎర్రమ్మ, సంధ్య, తదితరులు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి తరలింపు



వ్యాన్‌లో పాఠ్యపుస్తకాలను తరలిస్తున్న దృశ్యం

నెల్లిమర్ల రూరల్: పట్టణ పరిధిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల స్టాక్ పాయింట్ నుంచి మిగులు విద్యా సామాగ్రిని గురువారం జిల్లా కేంద్రానికి తరలించారు. మండలంలో ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, షూ, తదితర సామాగ్రి పంపిణీ పూర్తి కావడంతో.. మిగిలిన వాటిని ఉన్నతాధికారులకు అప్పగించామని ఎంఈఓలు విజయ్ కుమార్, సూర్యనారాయణ తెలిపారు. మొత్తం ఏడు వాహనాల్లో సామాగ్రిని తరలించామని చెప్పారు. సామాగ్రి తరలింపును జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి మధుసూదన్ పరిశీలించారు.

ప్రకృతి వ్యవసాయం మేలు



బ్రహ్మాస్త్రం తయారీపై అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

నెల్లిమర్ల రూరల్: ప్రకృతి వ్యవసాయాన్ని రైతులు అలవర్చుకోవాలని ఆ విభాగం యూనిట్ ఇన్‌చార్జ్ వర్రి గాయత్రి సూచించారు. మండలంలోని ఒమ్మి గ్రామంలో బ్రహ్మాస్త్రం తయారీపై రైతులకు గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చీడ, పీడల నివారణకు బ్రహ్మాస్త్రం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఆవు మూత్రం 15 లీటర్లు, రెండు కిలోల చొప్పున వేపాకులు, జామాకులు, బొప్పాయి, కానుగ ఆకులు ముద్దలుగా చేసుకుని బాగా మరిగించాలన్నారు. 48 గంటలు చల్లార్చిన తర్వాత వడకట్టి వచ్చిన ద్రావణాన్ని 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంబళ్ల రామలక్ష్మి, దుర్గారావు, కృష్ణమూర్తి, కర్రోతు లక్ష్మి పాల్గొన్నారు.

బదిలీ ఉద్యోగికి సన్మానం

విజయనగరం రూరల్: చెల్లూరు గ్రామ సచివాలయంలో ఏఎన్‌ఎంగా పనిచేసి శ్రీకాకుళం జిల్లాకు బదిలీపై వెళ్తున్న బి.మౌనికను సహచర ఉద్యోగులు, పెద్దలు గురువారం సత్కరించారు. ఎంపీపీ మామిడి అప్పలనాయుడు, నడిపేన శ్రీనివాసరావు, సర్పంచ్ కె. ఆదినారాయణ, ఎంపీటీసీ సభ్యుడు శంకరరావు, ఎంపీడీఓ గంటా వెంకటరావు పాల్గొన్నారు.

అవినీతి రహిత పాలనే సీఎం లక్ష్యం

- మేయర్ వెంపడాపు విజయలక్ష్మి
- వాడవాడలా జగనన్న సురక్ష శిబిరాలు



విజయనగరం రూరల్: దరఖాస్తుదారునికి ధ్రువపత్రాలు అందిస్తున్న ఎంపీపీ అప్పలనాయుడు, తదితరులు



డెంకాడ: గొలగాంలో లబ్ధిదారులకు పత్రాలను అందిస్తున్న ప్రజాప్రతినిధులు,అధికారులు



విజయనగరం: జగనన్న సురక్ష శిబిరంలో ధ్రువపత్రాలు పంపిణీ చేస్తున్న మేయర్, డిప్యూటీ మేయర్

విజయనగరం: అవినీతి రహిత పాలన అందించడమే సీఎం జగన్ మోహన్‌రెడ్డి లక్ష్యమని మేయర్ వెంపడాపు విజయలక్ష్మి అన్నారు. నగరంలోని 9, 40, 41, 42, 43 సచివాలయాల పరిధిలో గురువారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమాల్లో డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణితో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్, డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ, ప్రజలకు అవసరమయ్యే ధ్రువపత్రాల పంపిణీ కోసం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. సచివాలయ, వలంటరీ వ్యవస్థల ద్వారా ప్రజల ముంగిటికే ప్రభుత్వ సేవలు అందించే ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. మధ్యవర్తులు లేకుండా నేరుగా ప్రజల చెంతకే పథకాలను అందిస్తూ, ఆదర్శ పాలనకు శ్రీకారం చుట్టారని కొనియాడారు. కార్యక్రమంలో కమిషనర్ ఆర్. శ్రీరాములనాయుడు, అసిస్టెంట్ కమిషనర్ ప్రసాదరావు, డివిజన్ కార్పొరేటర్లు భోగాపురపు లక్ష్మి, జీవీ రంగారావు, జోనల్ ఇన్‌చార్జ్ బొద్దాన అప్పారావు, రెడ్డి గురుమూర్తి, మారం బాల బ్రహ్మారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు భోగాపురపు రవిచంద్ర, బాలి ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ సారథి..

విజయనగరం రూరల్: పేద ప్రజల సంక్షేమమే అజెండాగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని' విజయనగరం ఎంపీపీ మామిడి అప్పలనాయుడు అన్నారు. మండలంలోని చెల్లూరు గ్రామంలో ఎంపీపీ అప్పలనాయుడు ఆధ్వర్యంలో 'జగనన్న సురక్ష' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలకు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే శ్రమ లేకుండా వారి గ్రామాల్లోనే ఉచితంగా 11 రకాల ప్రభుత్వ సేవలు అందించడమే జగనన్న సురక్ష ముఖ్య ఉద్దేశమన్నారు. నాలుగేళ్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అవినీతికి తావులేకుండా పాలన జరిగిందని చెప్పారు. అనంతరం సుమారు 300 మందికి ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ నడిపేన శ్రీనివాసరావు, సర్పంచ్ కె.ఆదినారాయణ, ఎంపీటీసీ సభ్యుడు శంకరరావు, ఎంపీడీఓ గంటా వెంకటరావు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు బోద అప్పలకృష్ణ, పైడినాయుడు, పంచాయతీ కార్యదర్శి పి.రామకృష్ణ, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మలిచర్లలో...

మండలంలోని మలిచర్లలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ నడిపేన శ్రీనివాసరావు మాట్లాడుతూ, జగనన్న సురక్ష కార్యక్రమంలో 11 రకాల ధ్రువపత్రాలు ఉచితంగా జారీ చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కొనసర నిర్మల, మలిచర్ల, సుంకరిపేట సర్పంచ్‌లు రమాకుమారి, రాజేశ్వరి, ఈఓపీఆర్‌డీ డి.తిరుపతినాయుడు, మండల శాఖ అధికారులు, సచివాలయ సిబ్బంది, వైఎస్సార్‌సీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు..

డెంకాడ: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అధికారులు ప్రజల వద్దకు వచ్చి ప్రభుత్వ సేవలు అందిస్తున్నారని ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, వైస్ ఎంపీపీ పిన్నింటి తమ్మునాయుడు అన్నారు. మండలంలోని గొలగాం, మోదవలస గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో వారు మాట్లాడుతూ, ప్రజలకు మేలు చేయాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ పి.ఆదిలక్ష్మి, ఎంపీడీఓ డీడీ స్వరూపారాణి, సర్పంచ్ బూర్లె అప్పలనాయుడు, నాగవంశం కార్పొరేషన్ డైరెక్టర్ బోని అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు కనకల రామారావు, రమణరాజు, సాడి ఈశ్వరరావు, పలువురు నాయకులు, అధికారులు, గ్రామ సచివాలయ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

సీతారామునిపేటలో..

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సీతారామునిపేటలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులకు ధ్రువపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, ఎంపీటీసీ సభ్యురాలు మిరప శాంతికుమారి, గ్రామపెద్దలు, అధికారులు పాల్గొన్నారు. అలాగే సతివాడ గ్రామంలో జరిగిన కార్యక్రమంలో సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు సలహా మండలి సభ్యుడు అంబళ్ల శ్రీరాములనాయుడు, సర్పంచ్ రేవళ్ల శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యుడు రెడ్డి సత్యనారాయణ, అధికారులు పాల్గొన్నారు. అలాగే నగర పంచాయతీ పరిధిలోని మొయిద జంక్షన్ 2వ వార్డు సచివాలయ పరిధిలో జరిగిన కార్యక్రమంలో చైర్‌పర్సన్ బంగారు సరోజిని, పట్టణ అధ్యక్షుడు చిక్కాల సాంబశివరావు, వైస్ చైర్మన్లు సముద్రపు రామారావు, కారుకొండ వెంకట కృష్ణారావు, విశ్వ బ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ జానా ప్రసాద్, కమిషనర్ రామారావు, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష పేదలకు వరం..

పూసపాటిరేగ : జగనన్న సురక్ష పేదలకు వరమని ఎంపీడీఓ జి. రామారావు, జేసీఎస్ కన్వీనర్ మహంతి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని కోనాడ సచివాలయం పరిధిలో జగనన్న సురక్ష శిబిరం ఏర్పాటు చేసి 628 మందికి ధ్రువపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, 11 రకాల ధ్రువపత్రాలు పొందడంతో పాటు అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందని వారికి ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగ పడుతుందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఎస్. సత్యనారాయణ రాజు, తహసీల్దార్ ఇ.భాస్కరరావు, ఏపీఓ రత్నమాల, ప్రజాప్రతినిధులు మహంతి జనార్దనరావు, అమర గురువులు, దాడిశెట్టి త్రినాథరావు, బొడ్డు ఎల్లాజీ, దాడిశెట్టి గోవిందరావు, దారపు లక్ష్మణరెడ్డి, వి. కిరణ్, డి. మహేష్, తదితరులు పాల్గొన్నారు.



డెంకాడ: మోదవలసలో పత్రాలను అందిస్తున్న ప్రజాప్రతినిధులు,అధికారులు



నెల్లిమర్ల రూరల్: సీతారామునిపేటలో ధ్రువపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ సురేష్ బాబు, తదితరులు



పూసపాటిరేగ: కోనాడలో పత్రాలు అందజేస్తున్న ఎంపీడీఓ రామారావు, శ్రీనివాసరావు



నెల్లిమర్ల రూరల్: సతివాడలో ధ్రువపత్రాలు పంపిణీ చేస్తున్న రైల్వే బోర్డు సలహా మండలి సభ్యుడు అంబళ్ల



నెల్లిమర్ల రూరల్: ధ్రువపత్రాలు పంపిణీ చేస్తున్న చైర్‌పర్సన్ బంగారు సరోజిని, తదితరులు

అభివృద్ధిపథంలో విజయనగరం కార్పొరేషన్

- 34వ డివిజన్‌లో రూ.37.10 లక్షలతో అభివృద్ధి పనులకు శ్రీకారం
- శంకుస్థాపనలు చేసి పనులు ప్రారంభించిన మేయర్, డిప్యూటీ మేయర్లు



పార్కును ప్రారంభిస్తున్న నగర మేయర్, డిప్యూటీ మేయర్

విజయనగరం:

కార్పొరేషన్ హోదా దక్కించుకున్న విజయనగరాన్ని అభివృద్ధిపథంలో నిలపడమే ధ్యేయంగా పనిచేస్తున్నామని నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి అన్నారు. నగరంలోని 34వ డివిజన్‌లో రూ. 37.10 లక్షలతో నిర్మించనున్న అభివృద్ధి పనులకు గురువారం శంకుస్థాపనలు చేశారు. జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం ఎదురుగా ఏర్పాటు చేసిన పార్కును ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ, శంకుస్థాపన మాస మహోత్సవాల్లో భాగంగా అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. సమస్యలను తమ దృష్టికి తీసుకువచ్చినట్టైతే డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి సహకారంతో పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. నగరంలో రూ.10 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తున్నామన్నారు. ప్రధాన జంక్షన్ల అభివృద్ధితో పాటు ప్రజల మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, పార్కు అభివృద్ధి కమిటీ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

ప్రజా ప్రతినిధులు సహకరించాలి

- తహసీల్దార్ బంగార్రాజు



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ బంగార్రాజు

భోగాపురం:

మండలంలోని 22 పంచాయతీల్లో పకడ్బందీగా రూపొందించనున్న ఓటర్ల జాబితాకు ప్రజా ప్రతినిధులు సహకరించాలని తహసీల్దార్ సీహెచ్ బంగార్రాజు అన్నారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వివిధ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, బీఎల్‌ఓలతో ఎంఆర్‌ఓ బంగార్రాజు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ నెల 21 నుంచి నిర్వహించనున్న సమ్మర్ రివిజన్ కార్యక్రమంలో బీఎల్‌ఓలు ఇంటింటికీ వెళ్లి ఓటర్ జాబితా ప్రకారం సర్వే నిర్వహిస్తారన్నారు. గ్రామాల్లో లేకుండా బయట ప్రాంతాల్లో స్థిరపడిన వారిని, అదేవిధంగా మరణించిన వారిని ఓటర్ జాబితా నుంచి తొలగిస్తారని చెప్పారు. అదేవిధంగా మండలంలో ఉన్న ఓటర్లు ఎటువంటి ఇబ్బందులు పడకుండా తమ ఓటుహక్కును వినియోగించుకునేలా వివిధ పంచాయతీల్లో ఏర్పాటు చేసిన 53 పోలింగ్ స్టేషన్లకు ఓటర్లను సమానంగా సర్దుబాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ, టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన మండలశాఖ అధ్యక్షులు ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, కర్రోతు సత్యనారాయణ, వందనాల రమణ, డీసీసీ అధ్యక్షుడు సరగడ రమేష్‌కుమార్, బీఎస్పీ నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎరుకొండ వెంకటరావు, బీఎల్‌ఓలు, తదితరులు పాల్గొన్నారు.

పాడిరైతులకు రుణాలు



గోవిందపురంలో సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా పశు సంవర్ధక శాఖ సంచాలకుడు విశ్వేశ్వరరావు

పూసపాటిరేగ: రైతుభరోసా కేంద్రాల పరిధిలో గల పాడి రైతులకు కిసాన్ క్రెడిట్ కార్డు ద్వారా రుణాలు మంజూరు చేస్తామని జిల్లా పశుసంవర్ధక శాఖ సంచాలకుడు ఎ. విశ్వేశ్వరరావు అన్నారు. మండలంలోని కందివలస రైతుభరోసా కేంద్రంలో గురువారం నిర్వహించిన పశువిజ్ఞాన బడి కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పాడిరైతులకు సబ్సిడీపై సంపూర్ణ మిశ్రమ దాణా అందిస్తున్నట్లు చెప్పారు. అత్యవసర సమయంలో 1962 పశు అంబులెన్స్‌ను వినియోగించుకోవాలని కోరారు. అనంతరం గోవిందపురం పశువైద్యశాలను సందర్శించి రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో విజయనగరం పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు వై. వెంకటరమణ, గోవిందపురం పశువైద్యాధికారి ఎం. రాజేశ్వరితో పాటు కందివలస, గోవిందపురం, చింతపల్లి, కొవ్వాడ పశు సంవర్ధక సహాయకులు పాల్గొన్నారు.

పరిహారం సద్వినియోగం చేసుకోవాలి



కారి దేవికి వైఎస్సార్ బీమా చెక్ అందజేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

పూసపాటిరేగ: వైఎస్సార్‌బీమా పరిహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ జి. రామారావు అన్నారు. మండలంలోని కోనాడకు చెందిన కారి దేవి భర్త ఇటీవల ఓ ప్రమాదంలో మృతి చెందడంతో ఆమెకు రూ. 5 లక్షల వైఎస్సార్ బీమా చెక్‌ను గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ, ఆపదలో ఉన్న కుటుంబాలకు వైఎస్సార్ బీమా వరం లాంటిదన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఇ.భాస్కరరావు, ప్రజాప్రతినిధులు మహంతి శ్రీనివాసరావు, మహంతి జనార్దనరావు, అమర గురువులు, దాడిశెట్టి త్రినాథరావు, బొడ్డు ఎల్లాజీ, తదితరులు పాల్గొన్నారు.

వీఆర్ఏల నిరసన



నిరాహార దీక్ష చేస్తున్న వీఆర్ఏలు

భోగాపురం: కనీస వేతనం 26 వేల రూపాయలకు పెంచాలని కోరుతూ గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో సీఐటీయూ యూనియన్ నాయకుడు బి.సూర్యనారాయణ ఆధ్వర్యంలో వీఆర్ఏలు నిరాహార దీక్ష చేటపట్టారు. ఫేస్‌యాప్ హాజరు నుంచి మినహాయించాలని, రికవరీ జీవోను ఉపసంహరించి, డీఏతో కూడిన వేతనం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ మండల సెక్రటరీ బి.చంద్రరావు, నాయకులు దుర్గ, శ్రీను, శివ, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

నెల్లిమర్ల రూరల్: సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పలువురు వీఆర్ఏలు స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. కనీస వేతనాలు మంజూరు చేయడంతో పాటు డీఏ రికవరీ ఉత్తర్వులు వెనక్కి తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పలు గ్రామాలకు చెందిన వీఆర్ఏలు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమం..

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి
- 4వ డివిజన్‌లో 'గడప గడపకు మన ప్రభుత్వం'



4వ డివిజన్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల



లబ్ధిదారులతో మాట్లాడుతున్న నగర డిప్యూటీ మేయర్లు

విజయనగరం: అర్హత గల ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. గురువారం సాయంత్రం నగరంలోని 4వ డివిజన్ పరిధిలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల అమలు తీరుతో పాటు ప్రభుత్వ పనితీరుపై ఆరా తీశారు. స్థానిక సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం మేయర్ వెంపడాపు విజయలక్ష్మి మాట్లాడుతూ, ప్రభుత్వ పాలన పట్ల, సంక్షేమ పథకాలు అమలుపై ప్రజా స్పందన బాగుందన్నారు. ప్రతి ఇంటికీ ఏదో ఒక రూపంలో పథకాలు అందుతుండడంతో ప్రజల్లో ఆనందం వ్యక్తమవుతోందని చెప్పారు. దళారులు లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాలకే ప్రభుత్వ పథకాలు జమవుతుండడంతో ఎటువంటి అవినీతి చోటుచేసుకోవడం లేదన్నారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ప్రత్యేక శ్రద్ధతో ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. స్థానిక కార్పొరేటర్ మారోజు శ్రీనివాసరావు మాట్లాడుతూ, తమ డివిజన్ పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. మాట తప్పని మడమ తిప్పని నేతగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హులైన వారందరికి పథకాలు అందిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు. ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని , ఎమ్మెల్యేగా కోలగట్ల వీరభద్రస్వామిని మరోసారి గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ ప్రసాదరావు, 5వ డివిజన్ కార్పొరేటర్ గాదం మురళి, వైఎస్సార్ సీపీ నాయకులు కేఏపీ రాజు, చిట్టెళ్ల రాంబాబు, వజ్రపు శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

23వ డివిజన్‌లో...

అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం జనరంజక పాలన సాగిస్తోందని నగర డిప్యూటీ మేయర్లు కోలగట్ల శ్రావణి, ముచ్చు లయాయాదవ్ అన్నారు. నగరంలోని 23వ డివిజన్ పరిధిలో బొండాడ వీధి, ఉల్లివీధి, పరిసర ప్రాంతాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. పలువురు కాలువలు, విద్యుత్ సంబంధిత సమస్యలను తెలియజేయగా.. వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో నాయకులు కేదారిశెట్టి లక్ష్మణమూర్తి, నాగబాబు, తదితరులు పాల్గొన్నారు.